# స్వర్ణ అంధేరా ప్రదేశ్

**“శా**యిరామ్” గట్టిగా అరచాడు రంగారెడ్డి శాయిరామ్ ఇంటిముందు నిలబడి.

“వస్తున్నా వస్తున్నా” లోపల్నుంచే అన్నాడు శాయిరామ్.

అప్పటికే నేనూ, గోపాల్రావ్, యాదగిరీ కూడా శాయిరామ్ ఇంటి దగ్గరకు చేరుకున్నాం.

“ఈ శాయిరామ్‌తో పెట్టుకుంటే మనం వెళ్ళేసరికి ఆపని కాస్తా అయిపోతుంది” అన్నాడు గోపాల్రావ్.

శాయిరామ్ పెద్ద ‘దివిటీ’ తీసుకుని బయటికొచ్చాడు.

‘కట్టె ఎవరన్నా తీసుకొచ్చారా?” అడిగాడు శాయిరామ్.

“అది యాదగిరి డ్యూటీ కదా” అన్నాడు రంగారెడ్డి.

యాదగిరి ఓ లావుపాటి కట్టె మొద్దు గాల్లోకి లేపి మాకు చూపించాడు.

అప్పటికే దానికో కొనకి నిప్పంటించి ఉంది. సన్నగా పొగ వస్తోంది.

“పదండి పోదాం”

అందరం బయల్దేరాం.

నాలుగడుగులు వేసేసరికి కాలనీ బయట ఉన్న దుకాణం అతను ఎదురు పడ్డాడు.

యాదగిరి చేతిలో కాలుతున్న కట్టెతో ముందు, వెనుక మేము నడుస్తుండటం చూసి మమ్మల్ని పలుకరించాడతను ఆత్రుతగా “ఎవరు పోయారు సార్?” జాలిగా అడిగాడు.

మేము ఉలిక్కిపడ్డాం.

“పోవటమా? పోవటమేమిటి?” కోపంగా అడిగాడు రంగారెడ్డి.

“మరి ముందు నిప్పుకట్టె తీసుకుని యాదగిరిగారు వెనుక దివిటీ తీసుకుని శాయిరామ్ గారూ బయల్దేరారు కదా స్మశానానికి కాదా?”

మాకు వళ్ళు మండిపోయింది.

‘ఏమిటోయ్ ఆ పిచ్చి మాటలు? మేము వెళ్తోంది మా ఆఫీస్‌లో పనిచేసే ఫ్రెండ్స్ ఇంట్లో పెళ్ళికి...”

“పెళ్ళికా? పెళ్ళికివన్నీ ఏమిటి సార్?”

“అంటే నువ్వీ మధ్యనెప్పుడూ రాత్రుళ్లు రోడ్‌మీదకెళ్ళలేదా?”

‘కరెంట్ ఛార్జీలు పెరిగాక మొత్తం షాపులన్నీ ఆరింటికే మూసేస్తున్నారు కద్సార్– అందుకని ఆరు తర్వాత ఇల్లు వదలి బయటికెళ్ళటం ఏనాడో మానేశాం!”

“అది అందుకే బయట పరిస్థితి నీకు తెలీలేదు–”

అతని కుతూహలం పెరిగిపోయింది.

‘ఇంతకూ బయటి పరిస్థితి ఏమిటి సార్? ఏం జరుగుతోంది?”

“కరెంట్ బిల్ పెరిగిన దగ్గర్నుంచీ మునిసిపల్ కార్పొరేషన్ వాళ్ళు వీధిలైట్లు వేయటం మానేశారయ్యా! అందుకని ఆ కారు చీకట్లో కార్లుబస్‌లు ఇతర వాహనాలు దారినపోయే మనుషులకి డాష్ ఇచ్చేస్తున్నయ్. అందుకని జనం చీకట్లో రోడ్లమీద కెళాళ్ళాల్సి వస్తే దివిటీలు వెలిగించుకుని వెళ్తున్నారట. ఆ దివిటీలు చూసి వాహనాల వాళ్లు మనల్ని చంపకుండా డ్రైవ్ చేస్తారన్నమాట”

“మంచి అయిడియా సార్ ఇవాళే నేనూ రెండు దివిటీలు కొంటాను. మా ఆవిడ ఎప్పట్నుంచో సెకండ్‌షో సినిమాకెళ్దామని గొడవ చేస్తోంది.”

అతను వెళ్ళిపోగానే మేము మెయిన్‌రోడ్‌మీద కొచ్చేశాము. అప్పుడే బస్ స్టాప్‌లో నిలబడి ఉన్న జనం మీద నుంచి ఒక లారీ వెళ్ళిపోయేసరికి సడన్‌గా ఆర్తనాదాలు, హాహాకారాలు వినిపించినయ్. జనమంతా బస్‌స్టాప్ దగ్గరకు టార్చ్‌లైట్స్‌తో పరుగెడుతున్న చప్పుడు. మేము కూడా దివిటీ పట్టుకుని అక్కడకు పరుగెత్తాము.

చాలామందికి దెబ్బలు తగిలినయ్. మిగతావారు వారికి సాయం చేస్తున్నారు. ఈలోగా పోలీస్‌వ్యాన్ ఓ పెద్ద దివిటీతో వచ్చి ఆగింది.

“ఎంతమందికి దెబ్బలు తగిల్నయ్?” అడిగాడు ఇన్‌స్పెక్టర్.

“పద్నాలుగు మందికి సార్” అన్నాడు కానిస్టేబుల్ లెక్కపెట్టి.

“ఈ పద్నాలుగుమందినీ మన వాన్‌లో స్టేషన్‌కి తీసుకెళ్ళి లాకప్‌లోకి తొయ్”

అందరం ఉలిక్కిపడ్డాము.

“దెబ్బలు తగిలిన వాళ్ళను లాకప్‌లో వేస్తారా?” అడిగాడు రంగారెడ్డి.

"అవునయ్యా!చీకటి పడ్డాక దివిటీలు లేకుండా రోడ్‌మీదకు రాకూడదని మా డిపార్ట్‌మెంట్ ఎప్పటినుంచో టి.విలో పబ్లిసిటీ ఇస్తోంది. తెలీదా మీకు?"

"టీ.వి. ఎవడు పెడుతున్నాడు సార్. కరెంటు ఛార్జీలు పెరిగాక టీ.వి.సెట్లన్నీ అటకల మీద పడేశారు మా కాలనీ వాళ్ళందరూ"

"అవున్లే మా ఇంట్లోనూ అదే పరిస్థితి"అన్నాడు ఇన్‌స్పెక్టర్ వప్పుకుంటూ.

"అయినాగానీ బస్‌స్టాప్‌లో నిలబడ్డ జనం మీదనుంచి పోనిచ్చిన లారీ డ్రైవర్‌ని లాకప్‌లో వేయాలిగానీ వీళ్ళను వేస్తానంటారేమిటి సార్. దిసీజ్ టూమచ్" అన్నాడు శాయిరామ్.

"యస్- అయ్ సపోర్ట్ శాయిరామ్" అన్నాడు జనార్ధన్.

ఇన్‌స్పెక్టర్ టోపీ తీసి బుర్రగోక్కుని మళ్ళీ పెట్టేశాడు.

"ఆల్‌రైట్. దెబ్బలు తగిలిన వాళ్ళందర్నీ గవర్నమెంట్ హాస్పిటల్లో చేర్పిస్తాను. వాన్ ఎక్కండి" అన్నాడు జాలిపడి.

ఆమాట వినగానే దెబ్బలు తగిలినవాళ్ళు కొంతమంది కుంటుకుంటూనే శరవేగంతో చీకట్లోకి పారిపోయారు.

కాళ్ళకు పెద్దగాయాలయిన వాళ్ళు పారిపోలేక ఇన్‌స్పెక్టర్ కాళ్ళమీద పడిపోయారు.

"మేము మీకు ఏం ద్రోహం చేశాంసార్. గవర్నమెంట్ హాస్పిటల్లో చేరుస్తామంటున్నారు? అక్కడ పట్టపగలు హాస్పటల్లో చేరిన వాళ్ళే పైకెళ్ళిపోతున్నారు. అలాంటిది ఈ చీకట్లో చేరుస్తే, వాళ్ళు దివిటీలు పట్టుకుని అపరేషన్లు చేయటం మొదలుపెడితే ఎవడు బ్రతికి బట్టగడతాడు సార్?" అంటూ ఏడ్చేయసాగిందొకామె.

"మేమేం చేయలేమమ్మా! ఇది గవర్నమెంట్ రూలు. హత్యలు, ఆత్మహత్యలు, ప్రమాదాల కేసులన్నీ గవర్నమెంట్ హాస్పటల్స్‌లోనే చేర్చాలని స్పష్టంగా ఆర్డర్స్ ఉన్నయ్"

"నిజం చెప్పండి సార్? మీకే ఏదయినా ప్రమాదం జరుగుతే మీరు గవర్నమెంట్ హాస్పిటల్లో చేర్తారా సార్?"

..... ఛస్తానుగానీ ఛస్తే చేరను"

"పోనీ ఆ ఆర్డర్ పాస్ చేసిన ఎమ్మెల్యేలుగానీ, ఐఎఎస్‌లుగానీ, ఒక్కరయినా గవర్నమెంట్ హాస్పటల్లో చేరగా వినటంగానీ, కనటం గానీ జరిగిందా సార్?"

"వాళ్ళకేం ఖర్మయ్యా - వాళ్ళంతా అపోల్లో హాస్పటల్లో చేర్తారు. లేదా నిమ్స్‌లో చేర్తారు"

"మరి పగపట్టినట్లు మాకు ఈ శిక్షేమిటి సార్?" ఇంకొకతను అడిగాడు.

"అయితే ఏమంటారయ్యా ఇప్పుడు?"

"మాకింకా కొంత కాలమయినా బ్రతకాలని ఉందిసార్! అందుకని గవర్నమెంట్ హాస్పటల్ తప్ప ఇంకెక్కడయినా చేర్చండి. లేదా అసలు ఎక్కడా చేర్చకుండా మమ్మల్నిలా వదిలేయండి. మా చావులు మేము చస్తాం."

"సరే శ్రీనాట్ శ్రీ– వాళ్ళ ఛావు వాళ్ళను ఛావనీ. వాళ్ళను గవర్నమెంట్ హాస్పిటల్లో చేర్చకుండా వదిలేసినందుకు తలో వెయ్యి రూపాయలూ లంచం ఇవ్వాలని చెప్పు"

"ఏమిటి? గవర్నమెంట్ హాస్పటల్లో చేర్చకుండా వదిలేస్తే వెయ్యిరూపాయలు లంచం ఇవ్వాలా? ఇదెక్కడి సిస్టమండీ? కొత్తగా చెప్తున్నారు?" కోపంగా అడిగాడు రంగారెడ్డి.

ఇన్స్పెక్టర్ చిరాగ్గా చూశాడు.

'ఇదిగోచూడు మిస్టర్! గవర్నమెంట్ హాస్పిటల్లో చేరుస్తే మీ వాళ్ళెలాంటి కుక్క చావు చస్తారో అందరికీ తెలుసు. ప్రాణాలమీద తీపి ఉంటే తలో వెయ్యా కట్టమనండి. లేదంటే వాన్లో బలవంతంగా తీసుకెళ్ళి చేర్పిస్తాం."

ఆ మాటకు అందరూ భయపడి తలో వెయ్యిరూపాయలూ పోగుచేసి ఇచ్చేశారు. పోలీస్ వ్యాన్ వెళ్ళిపోయింది.

మేము మళ్ళీ దివిటీతీసుకుని పెళ్ళికి బయల్దేరాం. కొద్దిదూరం వెళ్ళేసరికి ఓ ఫంక్షన్ హాల్లో పెద్ద ఎత్తున బాండ్ మేళం వినబడుతోంది. లోపల నాలుగు ఎలక్ట్రిక్ బల్బులు దేదీప్యమానంగా వెలుగుతూ కనిపించినయ్. ఆశ్చర్యంతో మూర్ఛ వచ్చినంత పనయింది నాకు.

ఎందుకంటే ఒకేచోట నాలుగు బల్బులు వెలుగుతూండగా చాలా కాలం తరువాత చూడటం అదేమొదటిసారి.

ఆ బల్బులను జనమంతా ఎగబడి చూస్తున్నారు.

కొంతమంది తమ పిల్లలను చేతులమీద పైకి లేపి ఆ బల్బులు చూపిస్తున్నారు.

"చూశావా ఎలక్ట్రిక్ బల్బులు అలా వెలుగుతున్నామాట"

"అబ్బ! చాలా బాగున్నాయ్ డాడీ. మనింట్లో కూడా వెలిగిద్దాం డాడీ"

"చెప్పు తీసుకొందతాను పిచ్చిమాటలు మాట్లాడావంటే! చిన్నపిల్లాడిని చిన్నపిల్లాడి లాగుండు! ఏమిటా పెద్దమాటలు?" అంటూ తండ్రి కసురుకునేసరికి కుర్రాడు సైలంటయి పోయాడు.

"ఆ బల్బులు అంత కాంతివంతంగా వెలుగుతున్నాయ్ కదా! ఎన్ని కాండిల్స్ పవరుంటుందంటారు?" ఓ పెళ్ళి పెద్దనడిగాడు రంగారెడ్డి.

'ఒకోటీ సిక్స్టీ కాండిల్సయ్యా. మాటలేమిటి? అన్నాడా పెళ్ళి పెద్ద గర్వంగా.

"అమ్మో సిక్స్టీ కాండిల్ బల్బులు నాలుగే? ఇంత విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేస్తున్నాడంటే ఈ పెళ్ళివాళ్ళు టాటా, బిర్లాలంత గొప్పవాళ్ళయి ఉంటారు" అన్నాడు శాయిరామ్.

"ఏడ్చినట్లుంది మీ ప్రశ్న! ఈ పెళ్ళి బిర్లావాళ్ళ బంధువులదే."

మేము అక్కడినుంచి మళ్ళీ బయల్దేరాం. నాలుగడుగులు వేసేసరికి అక్కడి అపార్ట్‌మెంట్స్‌లో పెద్ద గొడవవుతోంది. దివిటీలు పట్టుకున్న ఆ జనం దగ్గరకెళ్ళి సంగతేమిటని అడిగాం.

"అడుగో ఆ సెకండ్‌ఫ్లోర్ పెద్దమనిషి. ఫ్లాట్ బయట బాల్కనీ దగ్గర నిలబడ్డ ఎదురింటామె భుజం మీద చేయి వేశాడంటండీ" చెప్పాడొకతను.

సెకెండ్ ఫ్లోర్ పెద్దమనిషి బోరున ఏడుస్తూ మాట్లాడుతున్నాడు.

"లైట్లు లేవు కదండీ చీకట్లో మా ఆవిడే బయట నిలబడిందనుకుని "లోపలికొచ్చేయవే" అని భుజం మీద చేయివేసి పిలిచానండీ. ఆమె గట్టిగా అరిచేవరకూ తెలీదు– ఆమె నా భార్య కాదని"

"అరె! బయట ఎవరు నిలబడితే వాళ్ళను భార్య అని ఎలా అనుకుంటాడండీ? చీకటయిన మాట నిజమే! అంత మాత్రాన భార్య అనేసుకుని భుజం మీద చేయి వేసేయటమేనా? ఎవరయినా అలా చీకట్లో కనిపించినప్పుడు ముందు పేరడగాలి. తర్వాత ఫలానా వాడి భార్యవేనా అని అడగాలి. ఆ తరువాత ఫ్లాట్‌నెంబర్ ఫలానాయేనా అని కూడా అడగాలి. అన్నిటికీ సమాధానాలు దొరికి ఆమె తన భార్యే అని ఋజువయినప్పుడు భుజం మీద చేయివేయాలి" ఆమె భర్త కోపంగా అంటున్నాడు.

"ఈ గొడవంతా పడే బదులు మీ అపార్ట్‌మెంట్ ప్రతిఫ్లోర్ బయటా ఒక మైనస్‌పాయింట్ 003 పవర్ గల బల్బు ఒకటి పెట్టుకోవచ్చుగా?" రంగారెడ్డి సలహా ఇచ్చాడు.

"కరెంట్ బిల్ మీ తాత కడతాడా?" కోపంగా అడిగేసరికి మేము జవాబివ్వలేక అక్కడినుంచి బయటపడ్డాం.

మేము మా స్నేహితుడి కూతురి తాలూకా మారేజ్‌హాల్‌కి చేరుకునేసరికే ముహూర్తం టైమవుతోంది.

నాలుగు వేపులా నాలుగు దివిటీలు  వెలుగుతున్నయ్.

ఒక దివిటీ పురోహితుడు పట్టుకుని మంత్రాలు చదువుతున్నాడు.

"ఆ ఇంక వధువు నెత్తిమీద జీలకర్ర బెల్లం పెట్టునాయనా. అయ్యో! ఆ పక్కనావిడ నెత్తిమీద పెట్టానయ్యా. వధువు తల ఇది. అయ్యా ఓ కొవ్వొత్తి ఇక్కడ పెట్టండి బాబూ- గొడవలయిపోతున్నయ్"

మా ఫ్రెండ్  మమ్మల్ని  చూసి ఆనందంగా తీసుకెళ్ళి కుర్చీల్లో కూర్చోబెట్టాడు.

"పెళ్ళికొడుకు ఏం జాబ్ చేస్తున్నాడు?"

"అమెరికాలో ఇంజనీర్. జీతం ఎక్కువ లేదుగానీ అక్కడ కరెంట్ ఫ్రీ అంట. అందుకని ఆలోచించకుండా ఇచ్చేశాం. అమ్మాయి సుఖపడుతుంది గదా అని.

"కట్నం ఏమిచ్చారు?"

"కాష్‌గా  ఏమీ అడగలేదు గానీ ఇక్కడున్న  వాళ్ళమ్మనాన్నలు వాళ్ళ కరెంట్ బిల్లు మేమే కట్టుకోవాలన్నారను.  కొంచెం భారం ఎక్కువే అనిపించినా మాకున్నది ఒక్కతే కూతురు గనుక వప్పుకున్నాం."

వారందరికీ అతని మీద జాలి వేసింది. సంపాదించిందంతా ఆ 5వాట్స్ కరెంట్‌బిల్ కట్టటానికే  సరిపోతుంది.

"మరి ఆడబడుచు కట్నాలేమయినా ఇచ్చారా?"

"తప్పుతుందా? ఆడబడుచువాళ్ళు జీరోవాట్స్ బల్బ్ వాడతారట. దాని కరెంట్‌బిల్ కూడా నెలనెలా సగం మేము కట్టుకోవాలిట. మిగతా సగం వాళ్ళు."

"మరి అవన్నీ నువ్వే కడితే ఇంక నువ్వూ మీ ఆవిడా, మీ అబ్బాయి ఏం తింటారు? అడుక్కోవలసిందేనా?"

ఇల్లు అమ్మేసి ఆ డబ్బు బాంక్‌లోవేయాలని డిసైడ్ చేసుకున్నాం. దాంతో ఓ అయిదారేళ్ళు  కరెంట్ బిల్‌కి సరిపోతుంది. తరువాత సంగతి తర్వాత చూద్దాం. తప్పేదేముంది? అన్నట్లు మీరు భోజనాలు చేయకుండా వెళ్ళకండి నేను వస్తా" అంటూ హడావిడిగా వెళ్ళిపోయాడతను.

"అనవసరంగా కరెంట్ బిల్  కమిటయిపోయాడు. ఆమధ్య మా బంధువొకాయన ఇట్లాగే గొప్పలకు పోయి తన కూతురు సంసారానికయే కరెంటు బిల్ మొత్తం  తనే కడతానని ఒప్పుకున్నాడు. దాంతో వాళ్ళు ఒక ఫానూ, ఒక 25 వాట్స్  బల్బ్, రోజుకో

ఆరు నిమిషాలు టి.వి. చూడటం మొదలు పెట్టారట. చివరకు కరెంట్ బిల్ ఎనిమిది కోట్లు వచ్చేసరికి ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు".

అందరూ అతని బంధువు మీద జాలిపడ్డారు.

"ఏమిటో! ఒకప్పుడు ప్రత్తి రైతు ఆత్మహత్యలు అని వినేవాళ్ళం. ఇప్పుడు అన్నీ కరెంట్ బిల్ ఆత్మహత్యలే వింటున్నాం" అన్నాడు జనార్ధన్.

"అందుకే మా బాబాయిగారేం చేశారో తెలుసా? వాళ్ళమ్మాయి పెళ్ళికి లక్ష క్యాండిల్స్ కట్నంగా ఇచ్చేశారు. దాంతో తేలిగ్గా వదిలిపోయింది" అన్నాడు గోపాల్రావ్.

'అవ్. వహీ అచ్ఛాహై! సస్తేమే హో జాతా" అన్నాడు యాదగిరి.

అందరు దివిటీల కాంతిలో భోజనాలు ముగించి మళ్ళీ మా కాలనీకి బయల్దేరాం. ఇంచుమించుగా కాలనీ దగ్గరకు చేరుకునేసరికి – ఓ లావుపాటి వ్యక్తి మాకెదురు వచ్చాడు.

"నిలవడండ్రీ! మీ తోటి పనున్నది" అన్నాడతను.

మాకు గుండెలు దబీల్మన్నయ్.

రాష్ట్రమంతటా రెండేళ్ళనుంచి కరెంట్ వాడటం తగ్గించే సరికి చీకట్లో దొంగతనాలు దోపిడీలు ఎక్కువయిపోతున్నాయ్. ఇప్పుడీ లావుపాటి వాడు కూడా దొంగే అయుంటాడని మా అందరికీ అనుమానం వచ్చేసింది.

'ఇదిగో చూడవోయ్. మా దగ్గర పైసలేమీ లేవు. నువ్ కత్తితో పొడిచినా ఒక్క పైసా రాదు" అన్నాడు రంగారెడ్డి.

అతను ఆశ్చర్యపోయాడు.

"కత్తేంది, పైసలేంది సార్– నేనేం దొంగననుకుంటిరా ఏంది?"

"కాదా? మరి నిలవడమంటివి?" అడిగాడు యాదగిరి.

"గదే. మీరీ నిర్భయ్ నగర్ కాలనీలో ఉంటారు గద్సార్."

"అవ్"

"మీ కాలనీకి కరెంట్ గిట్ట కావాల్నంటే నేను తక్కువ ధరకు సప్లయ్ జేస్తా సార్'

అందరం ఉలిక్కిపడ్డాం.

"తక్కువ ధరకు కరెంట్ సప్లయ్ చేస్తావా? అదీ ఆంధ్రప్రదేశ్లో? నీ మెదడు సరిగ్గా ఉందా?" అడిగాడు శాయిరామ్.

"బరాబర్ జేస్తాన్సార్! యూనిట్‌కి సగం ధరిస్తే చాలు"

మాకు అతనిమాటలేమీ అర్థం కావటం లేదు.

"అంత తక్కువ ధరకెలా ఇస్తావ్ నువ్వు?"

"పక్క రాష్ట్రాలకెళ్ళి కరెంట్ స్మగుల్ జేస్తున్నాం సార్. అంతా అండర్ గ్రౌండ్ కెళ్ళి వస్తది"

మేము కంగారుపడ్డాం.

"పోలీసులు పట్టుకోరూ?"

"ఆ మామూళ్ళన్నీ మేము జూసుకుంటాం సార్. మాది చాలా పెద్ద నెట్‌వర్కున్నది. రాయలసీమ బాచ్ మాకు బాకింగన్నట్లు"

మాలో మేము డిస్కషన్స్ ప్రారంభించాం.

సగం రేటంటున్నాడు తీసుకుంటే మంచిగుంటది కదా. పైగా ఎన్ని యూనిట్లు వాడినా అదే రేటంటున్నాడు. మన ఆంధ్రప్రదేశ్ లాగా వాడే కొద్దీ పెరిగిపోవటం ఉండదు" అన్నాడు గోపాల్రావ్.

"కానీ రాయలసీమ గాంగ్ అంటున్నాడు. వాళ్ళతో పెట్టుకుంటే మన కాలనీ అంతా బాంబులమయం అయిపోతుందేమో" అన్నాడు వెంకట్రావ్ భయంగా.

"అవునవును. పైగా స్మగుల్డ్ కరెంట్. వాళ్ళలో వాళ్ళకి గొడవలొచ్చినయ్యంటే మనం లేచిపోతాం" అన్నాడు రంగారెడ్డి.

"సరే అన్నా. మేము జరా సోంచాయించి జెప్తాం!" అన్నాడు యాదగిరి తప్పించుకోడానికి.

"ఇగో నా విజిటింగ్ కార్డ్. సెల్‌ఫోనున్నది. ఎప్పుడైనాగానీ ఫోను కొట్టొచు!!

మేము కాలనీలోకి అడుగుపెట్టేసరికి శ్యామ్రావ్ వాళ్ళింట్లో నుంచి పెద్దగా ఏడుపులు వినిపించినయ్.

అందరం అటువేపు పరుగెత్తాం.

శ్యామ్రావ్ బయటే నిలబడి వున్నాడు.

"ఏమిటి? ఏం జరిగింది? అడిగాడు రంగారెడ్డి.

"మా నాన్నగారు ఆత్మహత్య చేసుకున్నారు." అందరం ఆశ్చర్యపోయాం.

"అయ్యో! ఎందుకని? ఇంట్లో ఏమయినా సమస్యలున్నాయా?"

"ఏమీలేవు."

"అప్పులెక్కువయినయ్యా?"

"ఒక్కపైసా కూడా అప్పులేదు"

"మరెందుకు ఆత్మహత్య చేసుకున్నట్లు?"

"కరెంట్‌బిల్లు డెబ్బయ్ అయిదువేలు వచ్చింది. అది చూసిన దగ్గర్నుంచీ ఏవో పిచ్చిమాటలు మాట్లాడుతూనే ఉన్నాడు. కానీ మరీ ఇలా తెగిస్తారనుకోలేదు."

"కానీ మీరసలు కరెంట్ వాడటం మానేశారు కదా! అంత బిల్ ఎలా వచ్చింది?"

"ఆ మధ్యనొక రోజు ఇంట్లోకి పామొచ్చిందనీ, లైట్లన్నీ వేసి వెతికాం. ఇంట్లో పాముంటే ఉండనీండిగానీ అలా లైట్లు వేయకండి. పాము ఒకరినే కాటు వేస్తుందిగానీ కరెంట్ బిల్ కుటుంబాన్నే కాటేస్తుంది అని మా నాన్నగారు చెప్తూనే ఉన్నారుగానీ మేము వినిపించుకోకుండా తెల్లార్లూ లైట్లు అలాగే ఉంచాం. దాంతో అంత బిల్ పంపించారు" అంటూ మళ్ళీ కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

"ఏడవకయ్యా! పెద్దాడివి నువ్వే ఏడుస్తే ఎలా? మీ వాళ్ళందరికీ కూడా ధైర్యం చెప్పాలి నువ్వు. పోయినవాళ్ళు మనం ఏడుస్తే తిరిగి వస్తారా?" సముదాయించాడు శాయీరామ్.

"మేము ఏడుస్తోంది ఆయన గురించి కాదండీ!" అంది చనిపోయినతని భార్య.

"మరెందుకమ్మా?" ఆశ్చర్యంగా అడిగాం.

"ఆత్మహత్య చేసుకోడానికని ఆయన మెయిన్‌స్విచ్‌లో చేతులుపెట్టారు. ఇప్పుడు ఆ మాయదారి మీటరు ఎంత తిరిగిందోఏమిటో? మళ్ళీ ఇంకో ఎలక్ట్రిక్‌బిల్ ఎంత వస్తుందో ఏమిటోనని ఏడుస్తున్నాం.'

"మీరేం వర్రీ అవకండమ్మా. కాలనీ వాళ్ళందరం తలో కొంతా వేసుకుని సాయం చేస్తాంలే" అన్నాడు మా కాలనీ ప్రెసిడెంట్ గోపాల్రావ్.

"అయినా అతనికేం పోయేకాల మొచ్చిందండీ? కరంట్ ఛార్జీల సంగతి తెలిసుండీ కూడా మళ్ళీ కరెంట్ ద్వారానే ఆత్మహత్య చేసుకుంటాడా? ఆత్మహత్యకు ఎన్ని మార్గాల్లేవు? నగరం నడిబొడ్డులో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీ చుట్టుపక్కల ఓ ఇల్లు అద్దెకు తీసుకుని కొద్దిరోజులుంటే ఏదోక రోజు గ్యాస్ లీక్ అయినప్పుడు హాపీగా బాధ తెలీకుండా ఎగిరిపోవచ్చు. లేదా ఏదోక న్యూసెన్స్ కేస్‌లో కావాలని ఇరుక్కుంటే పోలీస్ లాకప్‌లో వేస్తారు. అక్కడ 48 గంటల్లోడెడ్‌బాడీ అయిపోవచ్చు" ఎవరో కామెంట్ చేస్తున్నారు.

"అన్నట్లు మీకీ విషయం తెలుసా?" ఒకతను అడిగాడు మమ్మల్ని.

"ఏ విషయం?"

"అదే మన గవర్నమెంట్ గంటక్రితం ఒక ఆర్డినెన్స్ పాస్ చేసిందట. దానిప్రకారం సిటీలో ఉన్న వాళ్ళందరూ కంపల్సరీగా వంద యూనిట్లు కరెంట్ ఉపయోగించాలట! మనం వాడినా వాడకపోయినా కరెంట్ కనెక్షన్ వద్దన్నా కూడా ఈ బిల్ కట్టాల్సిందేనంట" అందరం గాబరా పడిపోయాం.

"అమ్మో వంద యూనిట్లే? అంటే మన జీతం మొత్తం కట్టాల్సి వస్తుంది."

"కానీ మనం కరెంట్ వాడకపోతే ఏం జేస్తారు?"

"ఇప్పుడు అందరూ వాడటం మానేసి కరెంట్ కనెక్షన్స్ వద్దంటున్నారనే ఈ ఆర్డినెన్స్ పాస్ చేసారట."

అందరి గుండెలూ వేగంగా కొట్టుకుంటున్నయ్.

దిగాలుపడి ఇళ్ళకు చేరుకున్నాం. ఆ రాత్రి ఎవరికీ నిద్రపట్టినట్లు లేదు. మర్నాడు తెల్లారుజామునే వీధిలో ఏదో కోలాహలం వినిపించి అందరం ఇళ్ళల్లోనుంచి బయటికొచ్చాము.

ఇంట్లో సామానంతా లారీలో లోడ్ చేస్తూ కనిపించాడు లోకనాథం. ఆశ్చర్యంగా అతని చుట్టూ మూగాము.

"ఏమిటి ఇల్లు ఖాళీ చేస్తున్నారా?" అడిగాడు రంగారెడ్డి.

"అవును!"

"ఏ ఏరియాకెళ్తున్నావ్?"

'ఏరియా లేదూ- వంకాయ్ లేదు. మా స్వగ్రామం దగ్గర అడవిలో ఓ కొండ దగ్గర రెండు గదులు కట్టించాను. సిటీలో ఉంటే ఎప్పటికయినా ఎలక్ట్రిసిటీతో మన కొంపలు మునుగుతాయని నాకు తెలుసు. నేననుకున్నట్లే కరెంట్ కనెక్షన్ కంపల్సరీగా తీసుకోవాలనీ, వాడినా వాడకపోయినా వంద యూనిట్లు మినిమమ్ బిల్ కట్టాలనీ రూల్ వస్తోందిట.

ఇప్పుడు నేను అడవుల్లో కట్టుకున్న ఇంటికి కరెంట్ అవసరమే లేదు. ఒకవేళ గవర్నమెంట్ కంపల్సరీగా తీసుకోవాలని అన్నా ఆ చుట్టుపక్కల యాభై కిలోమీటర్ల వరకు ఎలక్ట్రిక్ లైన్లే లేవు. కనుక కరెంట్ వస్తుందన్న భయమే లేదు. ఆ అడవిలో నీళ్ళు హాయిగా బకెట్‌తో తోడుకోవచ్చు. మోటార్ అవసరంలేదు. వెన్నెల కాంతిలో హాయిగా

పనులన్నీ చేసుకోవచ్చు. నాకూ మా ఆవిడకూ మా అమ్మాయికీ అందరికీ తలో సైకిలూ కొనుక్కున్నాం గనుక ఎవరి పనులు వాళ్ళు చూసుకుని సాయంత్రానికి ఇంటికి చేరుకోవచ్చు. మీరు కూడా ఒక్కసారి ఊహించుకోండి. కరెంట్ తీగలు. మీటరు, లైట్లు లేని ఇల్లు ఎంత ఆనందంగా ఉంటుందో! ఎక్కువ బిల్ వచ్చే ప్రసక్తే లేదు. కట్టిన బిల్ కట్టలేదని ఎవడూ అనడు. కరెంట్ కట్ చేస్తామని ఎవడూ బెదిరించడు. వేలకువేలు బిల్లులు ఎవడూ మన మీద రుద్దడు. ఇవేమీ లేని ఇల్లు– ఆహా! హాపీగా, హాయిగా చిన్న ప్రమిద వెలిగించుకుని సుఖంగా జీవితం గడపాలన్న నా చిన్ననాటి కోరిక ఇప్పుడీ కరెంట్ ఆర్డినెన్స్ వల్ల నెరవేరింది. ఆహా– నా జన్మ తరియించెన్."

అంటూ పాటపాడుతూ సామన్లు లారీలో లోడ్ చేయటంలో నిమగ్నమయి పోయాడు.

ఓ పక్క అతనినీ, మరో పక్క మా ఇళ్ళలోకి మృత్యుపాశంలాగా విద్యుత్ స్తంభాల నుంచి వెళ్తోన్న సర్వీస్ వైర్ వేపూ చూస్తుంటే అతని మీద ఈర్ష్య కలిగింది మాకు.

"మనం కూడా ఎప్పటికయినా ఈ ఎలక్ట్రిసిటీ బిల్లుల నుంచి తప్పించుకుని హాయిగా కరెంట్‌లేని చోట ఉండగలమంటారా?" అడిగాడు రంగారెడ్డి ఊహల్లో తేలిపోతూ.

మేమంతా కూడా అతని ఊహల్లోకెళ్ళిపోయాం ఆనందంగా.